క్లుప్తంగా

కష్టపడే వారికి పార్టీ ఆదరణ

వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు కో–ఆర్డినేటర్ గిరిబాబు



కిర్లంపూడి: పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరినీ వైఎస్సార్ సీపీ ఆదరించి ఉన్నత స్థానంలో నిలబెడుతుందని పార్టీ ప్రత్తిపాడు కో–ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రత్తిపాడు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో అనుబంధ విభాగాల్లో నియమితులైన అధ్యక్షులకు శుభాకాంక్షలు తెలిపారు. తమకు అప్పగించిన బాధ్యతలకు అనుగుణంగా గ్రామాల్లోని కార్యకర్తలతో మమేకమై, క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను ప్రజల దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. అమలు కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు.

ఈ రోడ్డుకు మోక్షమెప్పుడో ?



చిల్లంగి శివాలయం ఎదురుగా గుంతలమయంగా మారిన రోడ్డు

కిర్లంపూడి: చిల్లంగి–వేలంక మార్గంలో ప్రయాణం వాహనదారులకు నరకప్రాయంగా మారింది. సుమారు మూడు కి.మీ. పొడవున ఉన్న ఈ రోడ్డు గోతులమయమైంది. వర్షాకాలం వస్తే ఈ రోడ్డుపై ప్రయాణం చేయలేని పరిస్థితి నెలకొంది. నిత్యం వందలాది మంది రైతులు, విద్యార్థులు, గ్రామస్తులు ప్రయాణించే ఈ రోడ్డుపై అడుగడుగునా భారీ గోతులు ఏర్పడ్డాయి. అదుపు తప్పితే ప్రమాదం తప్పదని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

ఘనంగా అన్న సమారాధన



వనదుర్గమ్మను దర్శించుకుంటున్న చంటిబాబు

కిర్లంపూడి: గ్రామ శివారున ఉన్న వనదుర్గమ్మ అమ్మవారి ఆలయం వద్ద శుక్రవారం భారీ అన్న సమారాధన జరిగింది. మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అమ్మవారిని దర్శించుకుని, అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. స్థానిక, పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు, దోమాల గంగాధర్, పెంటకోట శ్రీరాములు, గూనూరి సందీప్ పర్యవేక్షించారు.

అప్రమత్తంగా ఉండాలి

గండేపల్లి: వేసవి సెలవుల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ శుక్రవారం ఇక్కడ హెచ్చరించారు. సెలవుల నేపథ్యంలో ఊళ్లకు వెళుతున్నప్పుడు బంగారు, వెండి, విలువైన వస్తువులు, నగదు ఇళ్లల్లో ఉంచరాదన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ కచ్చితంగా ధరించాలన్నారు.

5న గంగాలమ్మ తల్లి గావు సంబరం

ప్రత్తిపాడు రూరల్: ఒమ్మంగిలో ఈ నెల 5న గంగాలమ్మ తల్లి గావు సంబరం జరగనుంది. ఒమ్మి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఈ సంబరాన్ని నిర్వహిస్తారు. ఆదివారం అమ్మవారిని దింపడం, ఆలయ వద్ద తప్పెట గుళ్ల (గరిడీలు) ఆటలు, సోమవారం సాయంత్రం అమ్మవారి ఊరేగింపు నిర్వహించినట్లు ఒమ్మి కుటుంబ సభ్యులు వివరించారు.

అగ్ని బాధితులకు సాయం

తుని రూరల్: తుని మండలం దొండవాక శివారు చిక్కుళ్ల అగ్రహారంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు రెడ్‌క్రాస్ సొసైటీ నిత్యావసర సరకులు, వంట పాత్రలు పంపిణీ చేసింది. శుక్రవారం రెడ్‌క్రాస్ సొసైటీ తుని బ్రాంచి ప్రతినిధులు డాక్టర్ నేరేళ్ల సత్యనారాయణ, నేరేళ్ల సతీష్, ఆకెళ్ల శాస్త్రి, గొల్లపూడి ప్రసాద్, వీఆర్వో జి.కాటమస్వామి ఆయా బాధిత కుటుంబాలకు సాయాన్ని అందజేశారు. మాజీ సర్పంచ్ గంట్ల సత్యనారాయణ, సర్వేయర్ దేవుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ రహదార్లపై ప్రత్యేక దృష్టి

ఏలేశ్వరం: అన్ని గ్రామాల్లో రోడ్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్టు ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి తెలిపారు. పెద్దనాపల్లిలో శుక్రవారం ఉపాధి హామీ పథకం నిధులు రూ.15 లక్షలతో రహదారి నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ రోడ్లతో పాటు, డ్రైన్లను అభివృద్ధి చేస్తామన్నారు. పలు గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సూర్యనారాయణ, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు జ్యోతుల పెదబాబు, సర్పంచ్ బుద్దా సూర్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుకు సన్నద్ధం!

- గ్రామాల్లో జోరుగా మట్టి నమూనాల సేకరణ
- వేసవి దుక్కులు ప్రారంభించిన రైతులు
- 29 వేల ఎకరాల్లో వరిసాగుకు సన్నాహాలు



హెచ్.కొత్తూరులో పత్తి సాగుకు దుక్కు చేసిన భూమి

తుని రూరల్: ఖరీఫ్ సాగుకు అధికారులు, రైతులు సన్నద్ధమవుతున్నారు. ఖరీఫ్ పంట కాలం సమీపిస్తుండడంతో ప్రణాళిక అమలు చేసేందుకు సిద్ధమయ్యారు. 2025–26 ఖరీఫ్ సీజన్ జూన్ నుంచి ప్రారంభంకానుంది. దీంతో అధికారులు భూసారం తెలుసుకుని సూక్ష్మ పోషకాలు అందించేందుకు మట్టి నమూనాలు సేకరిస్తున్నారు. సాగుదారుల (కౌలుదారు) కార్డుల జారీకి అర్హుల నుంచి దరఖాస్తులు తీసుకుంటున్నారు. అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు పత్తి, వరి, ఇతరేతర పంటలు సాగు చేసే రైతులు వేసవి దుక్కులకు సన్నద్ధమయ్యారు.

సాగునీటి లభ్యత లేనిచోట అపరాలు

తుని నియోజకవర్గం మెట్ట ప్రాంతం కావడంతో సాగునీటి లభ్యతలేని గ్రామాల్లో రైతులు అపరాలు, నూనె గింజలు, చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించారు. పంపా, తాండవ రిజర్వాయర్లతో పాటు, పుష్కర, పీబీసీ కాలువల ద్వారా సాగునీరు లభించే ప్రాంతాల్లో రైతులు వరిసాగు చేయనున్నారు. తక్కువ నీటి వనరులు, స్వల్ప పెట్టుబడులతో చేపట్టే సేంద్రియ సాగుపై ప్రకృతి వ్యవసాయ నిర్వాహకులు గ్రామాల్లో అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలో 36 వేల ఎకరాల్లో పత్తి, వరి, మొక్కజొన్న, ఇతరేతర పంటలు సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు ప్రాథమిక అంచనాలు వేశారు.

తుని మండలంలో 6,500 ఎకరాల్లో..

వివిధ ప్రాజెక్టులు, కాలువలు, వర్షాధారంగా నియోజకవర్గంలోని మూడు మండలాల్లో రైతులు 29 వేల ఎకరాల్లో ఖరీఫ్ వరి నాట్లు వేస్తారని వ్యవసాయ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. పుష్కర, తాండవ కాలువలు, వర్షాధారంపై తుని మండలంలో 6,500 ఎకరాలు, పంపా రిజర్వాయర్, పుష్కర, పీబీసీ కాలువల ఆయకట్టు కింద 13,500 ఎకరాలు, తాండవ రిజర్వాయర్, చెరువులు ఆయకట్టు కింద కోటనందూరు మండలంలో తొమ్మిది వేల ఎకరాల్లో వరిసాగు జరగనుంది. రిజర్వాయర్లు, కాలువలతో పాటు, పుష్కలంగా వర్షాలు కురిస్తేనే ఖరీఫ్ పంటలు గట్టెక్కుతాయని రైతులు అంటున్నారు.



అగ్రహారంలో దమ్ములో కలియదున్నేందుకు పొలంలో వేసిన గెత్తం

3,710 క్వింటాళ్ల విత్తనాలు అవసరం

మూడు మండలాల్లో ఖరీఫ్‌కు 3,710 క్వింటాళ్ల వరి విత్తనాలు, రెండు వేల ప్యాకెట్ల వరకూ పత్తి విత్తనాల అవసరమవుతాయి. పత్తి విత్తనాలను పూర్తిగా ప్రైవేట్ డీలర్లే విక్రయిస్తుండగా, వరి విత్తనాలు కొంతమేరకు ప్రభుత్వం సమకూర్చుతోంది. అత్యధిక శాతం ప్రైవేట్ డీలర్లు, రైతుల నిల్వ చేసుకున్న విత్తనాలే ఆధారం. నియోజకవర్గంలో ప్రధానంగా ఆర్‌జీఎల్ 2537, ఎంటీయూ 1064, ఎంటీయూ 1262, బీపీటీ 5204 తదితర రకాల విత్తనాలకు డిమాండ్ ఉంది.

15 వరకూ మట్టి నమూనాల సేకరణ



ఈ నెల 15 వరకూ మట్టి నమూనాలు సేకరిస్తాం. మండలంలో 1,375 నమూనాలు సేకరించాల్సి ఉంది. ఇప్పటికే 550 సేకరించాం. మండలంలో 2035 మంది కౌలుదారులకు సాగుదారుల కార్డులు జారీ చేస్తాం. జూలై వరకూ దరఖాస్తులు తీసుకుంటాం. తుని మండలంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 8,560 ఎకరాల్లో వరి, పత్తి, ఇతర పంటలు సాగయ్యే అవకాశం ఉంది. 374 క్వింటాళ్ల విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచేలా ఏర్పాట్లు చేస్తున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాలతో సాగుపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తాం.

– బి.అశోక్ కుమార్, వ్యవసాయ అధికారి, తుని మండలం

రేపటి నుంచి శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు



ఎస్.అన్నవరంలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం

తుని రూరల్: ఎస్.అన్నవరంలోని శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 4 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించేందుకు ఆలయ ధర్మకర్తలు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా నిత్యపూజలు, పర్వదినాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు వారు తెలిపారు. 4న 108 కలశాలతో శోభాయాత్ర, 5న పుణ్యాహవచనం, 6న అగ్ని ప్రతిష్ఠ, గరుడ హోమం, 7న ఉదయం సామూహిక శ్రీలక్ష్మీనారాయణ వ్రతం, చంద్రప్రభ వాహన సేవ, 8న ధన్వంతరీ హోమం, సాయంత్రం ఎదుర్కోలు ఉత్సవం, 9న శ్రీకృష్ణ గోపికా పూజ, అశ్వవాహన సేవ, శ్రీకృష్ణ తులాభారం, 10న సుదర్శన హోమం, గజ వాహన సేవ, సహస్ర దీపాలంకరణ సేవ, తెప్పోత్సవం, 11న స్వాతి నక్షత్రం, నృసింహ జయంతి సందర్భంగా శ్రీలక్ష్మీనారసింహ హోమం, గరుడ వాహన సేవ, తిరువీధి పల్లకీ సేవ, 12న మహా పూర్ణాహుతి, వసంతోత్సవం, శ్రీవారి పుష్కరిణిలో చక్రస్నానం, శ్రీపుష్పయాగం, మహాదశీర్వచనం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు వివరించారు.

ఘనంగా జగద్గురు ఆదిశంకరాచార్య జయంతి



ఆదిశంకరాచార్య విగ్రహం, చిత్రపటాన్ని పల్లకీలో ఊరేగింపు నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: శంకర జయంతి సందర్భంగా జగద్గురు ఆదిశంకరాచార్యకు శుక్రవారం రత్నగిరి సత్యదేవుని సన్నిధిలో ఘనంగా పూజలు నిర్వహించారు. ఉదయం సత్యదేవుని గర్భాలయంలో ఆదిశంకరాచార్య విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దర్బారు మండపంలో శంకరాచార్య చిత్రపటానికి పూజలు చేశాక ఆలయ ప్రాకారంలో ఆదిశంకరాచార్య చిత్రపటం, విగ్రహంతో ఊరేగింపు నిర్వహించారు. ఈఓ వీర్ల సుబ్బారావు, అధికారులు పాల్గొన్నారు. పలువురు పండితులు మాట్లాడుతూ హిందూ మతస్తులు ఎన్నో మతాలు, వర్గాలుగా చీలి, వారిలో వారు ఘర్షణ పడుతున్న సమయంలో.. వైదిక మతంలో విభేదాలను రూపుమాపి, అందరినీ ఏకతాటిపై తెచ్చి జగద్గురు అనిపించుకున్నారని ప్రశంసించారు. దేశం నలువైపులా నాలుగు పీఠాలు స్థాపించి హిందూ మతోద్ధారణకు పాటుపడిన వ్యక్తి అని కొనియాడారు.

భారీ ర్యాలీ

ఆదిశంకరాచార్య జయంతి సందర్భంగా సత్యగాయత్రీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సుబ్బరాయపురం నుంచి వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అన్నవరం వాసి శ్రీసత్య చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి నామధేయంతో కంచిపీఠం ఉత్తరాధికారిగా, తదుపరి 71వ పీఠాధిపతిగా నియమితులవడంపై హర్షం వ్యక్తం చేశారు. మహిళల కోలాటం, భక్తి గీతాలాపనతో ర్యాలీ కొనసాగింది.

గోకవరం: జగద్గురు ఆదిశంకరాచార్యులు, భగవత్ రామానుజాచార్యులు జయంతిని స్థానిక దేవీచౌక్ ఆలయంలో శుక్రవారం వీహెచ్‌పీ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంస్థ రాజమహేంద్రవరం జిల్లా ప్రచార ప్రముఖ్ ఉంగరాల ఆదివిష్ణు మాట్లాడుతూ, అజ్ఞానంతో ఉన్న హిందూ సమాజాన్ని అద్వైత సిద్ధాంతంతో జ్ఞాన జ్యోతులు వెలిగించిన మహానుభావుడు ఆదిశంకరాచార్యులని కొనియాడారు. పండితపామర బేధం లేకుండా అందరికీ మోక్ష మార్గాన్ని చూపిన మహనీయుడు రామానుజాచార్యులు అని చెప్పారు.

మురళీకృష్ణంరాజుకు అభినందనల వెల్లువ

ప్రత్తిపాడు రూరల్: వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకులుగా నియమితులైన పార్టీ నేత ముదునూరి మురళీకృష్ణంరాజును ఆయన స్వగృహమైన ధర్మవరంలో శుక్రవారం పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ దడాల సతీష్‌తో పాటు, పార్టీ నాయకులు కొండపల్లి అప్పారావు, కటకం ఈశ్వరరావు, తాటిపాక కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మురళీకృష్ణంరాజును అభినందిస్తున్న పార్టీ నేతలు

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులు వీరే..

ఏలేశ్వరం: ప్రత్తిపాడు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ మండల అనుబంధ విభాగాల అధ్యక్షులను శుక్రవారం ప్రకటించారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వీరి నియామకాలు జరిగాయి.

ఏలేశ్వరం మండలం

మహిళా విభాగం అధ్యక్షురాలుగా వీవీ రమణమ్మ, రైతు విభాగం అధ్యక్షుడిగా సింగిరెడ్డి సోమన్నదొర, బీసీసెల్ అధ్యక్షుడిగా అల్లం ఆదినారాయణ, ఎస్సీసెల్ అధ్యక్షుడిగా గుండుబిల్లి చక్రం, ఎస్టీసెల్ అధ్యక్షుడిగా తడాల అప్పారావుదొర, క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా గునుపూడి కొండబాబు, స్టూడెంట్ విభాగం అధ్యక్షుడిగా పిల్లా వీరదుర్గబాబు, పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడిగా మజ్జూరి సూర్యనారాయణ, వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా గుల్లంపూడి గంగాధర్, వైఎస్సార్ టీయూసీ విభాగం అధ్యక్షుడిగా నాగులాపల్లి కొండలరావు, అంగన్‌వాడీ విభాగం అధ్యక్షుడిగా బొజ్జ రామలక్ష్మి, సోషల్ మీడియా అధ్యక్షుడిగా కమతం వెంకటేశ్వరాస్వామి, దివ్యాంగుల విభాగం అధ్యక్షుడిగా ఏనుగుపాటి సురేంద్రను నియమించారు.

ఏలేశ్వరం నగర పంచాయతీ

యూత్‌వింగ్ అధ్యక్షుడిగా ఈపి రాము, మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా ఎండీ నూరిన్‌ఖాన్, మున్సిపల్ విభాగం అధ్యక్షుడిగా లోగీసు చంద్రశేఖర్, ఆర్‌టీఐ విభాగం అధ్యక్షుడిగా దత్తి ఎస్ఎన్ రాజు, వలంటీర్ల విభాగం అధ్యక్షుడిగా ఎద్దు నవీన్‌కుమార్, వీవర్స్ విభాగం అధ్యక్షుడిగా శెట్టి శ్రీను, కల్చరల్ విభాగం అధ్యక్షుడిగా రెడ్డి రాఘవ, పబ్లిసిటీ విభాగం అధ్యక్షుడిగా దనేడి పవన్‌సురేష్ నియమితులయ్యారు.

ప్రత్తిపాడు మండలం

యూత్‌వింగ్ అధ్యక్షుడిగా చందక నాని, మహిళా విభాగం అధ్యక్షురాలిగా ఏపూరి నాగమణి, రైతు విభాగం అధ్యక్షుడిగా విత్తనాల నాగేశ్వరరావు, బీసీసెల్ అధ్యక్షుడిగా దేవర రాధాకృష్ణ, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా రాపాక గుర్రాజు, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా కూరపు గంగరాజు, మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా ఎస్‌కే ఇబ్రహీం, క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా పులి బాబులు, స్టూడెంట్ వింగ్ అధ్యక్షుడిగా గొల్లా సతీష్‌కుమార్, పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షుడు పినిశెట్టి ప్రకాశ్, ఆర్‌టీఐ వింగ్ అధ్యక్షుడిగా రంగనాథం అబ్బాయి, వలంటీర్ల వింగ్ అధ్యక్షుడిగా తొర్రెల చరణ్‌రాజ్, వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా ఉమ్మ వెంకటరమణ, వీవర్స్ విభాగం అధ్యక్షుడిగా జక్కా త్రిమూర్తులు, వైఎస్సార్ టీయూసీ అధ్యక్షుడిగా ఉమ్మిడి వీవీ సత్యనారాయణ, కల్చరల్ వింగ్ అధ్యక్షుడిగా నిదుల శ్రీను, సోషల్ మీడియా వింగ్ అధ్యక్షుడిగా ఉలిసి శివ, దివ్యాంగుల విభాగం అధ్యక్షుడిగా ఆనకాపల్లి సూకరాజు, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడిగా రేఖా శ్రీనును నియమించారు.

శంఖవరం మండలం

యూత్‌వింగ్ అధ్యక్షుడిగా జీలకర్ర లక్ష్మణరావు, మహిళా విభాగం అధ్యక్షురాలిగా మిరియాల పద్మావతి, రైతు విభాగం అధ్యక్షుడిగా మామిడి దేవుళ్లు, బీసీసెల్ అధ్యక్షుడిగా కొమిరిశెట్టి శ్రీనివాస్, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా చోటాడ రాజు, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా గుండు చినబాబు, క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా నాగబత్తుల ప్రేమ్‌కుమార్, స్టూడెంట్ వింగ్ అధ్యక్షుడిగా సకురు సొరాజ్, పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షుడు బొద్దు నాగసత్యనారాయణ, ఆర్‌టీఐ వింగ్ రమణం సత్యనారాయణ, వలంటీర్ల వింగ్ అధ్యక్షుడిగా అర్లి పూసలు, వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా గౌతు శ్రీనివాసరావు, వీవర్స్ విభాగం అధ్యక్షుడు వానపల్లి సత్యనారాయణ, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడిగా వెలుగుల అప్పలరాజు నియమితులయ్యారు.

రౌతులపూడి మండలం

యూత్‌వింగ్ అధ్యక్షుడిగా సోమరౌతు రాజా, మహిళా విభాగం అధ్యక్షురాలిగా దెయ్యాల బేబీ, రైతు విభాగం అధ్యక్షుడిగా కర్రిచిట్టిబాబు, బీసీ సెల్ అధ్యక్షుడిగా సింగంపల్లి చిట్టిబాబు, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా సారిపల్లి వెంకటేష్, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా చీనాడ దేవుడు, మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా షేక్ వలీ, క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా బండారు బైరాగి, స్టూడెంట్ వింగ్ అధ్యక్షుడిగా రౌతు ఫణిదుర్గానారాయణ, పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షుడు బీమలింగం నాగరాజు, వలంటీర్ల వింగ్ అధ్యక్షుడిగా కరక అశోక్, వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా బండారి వెంకన్నబాబు, సోషల్‌మీడియా వింగ్ అధ్యక్షుడిగా బొద్దుకమల్, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడిగా మంతెన పాపారావును నియమించారు.

యూత్ అధ్యక్షుల నియామకం

తుని: వైఎస్సార్ సీపీని మండల స్థాయిలో బలోపేతం చేసేందుకు పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం మండల యూత్ అధ్యక్షులను నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులను జారీ చేసింది. తుని పట్టణ యూత్ అధ్యక్షుడిగా మర్రా దాసు, కోటనందూరు అధ్యక్షుడిగా బంగారు బ్రహ్మానాయుడు, తుని మండల అధ్యక్షుడిగా లంక సత్తిబాబు, తొండంగి మండల అధ్యక్షుడిగా పప్పల వీరవెంకట రమణమూర్తి నియామితులయ్యారు. పార్టీలో కీలక స్థానం కల్పించిన మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజాకు వారు కృతజ్ఞతలు తెలిపారు. మండల, పట్టణ స్థాయిలో ప్రజల తరఫున పోరాటం చేస్తామన్నారు.



మర్రా దాసు



బంగారు బ్రహ్మానాయుడు



లంక సత్తిబాబు



పప్పల రమణమూర్తి

కిశోర బాలికల సంక్షేమానికి ప్రాధాన్యం



తునిలో జరిగిన సమ్మర్ క్యాంపులో మాట్లాడుతున్న కమిషనర్



జగ్గంపేటలో మహిళా పోలీసులకు మెటీరియల్ అందిస్తున్న సత్యనారాయణ

జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సత్యనారాయణ

జగ్గంపేట: సమాజంలో కిశోర బాలికల సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యమిస్తున్నామని జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సత్యనారాయణ తెలిపారు. జగ్గంపేటలో తెలుగు సమైక్య కార్యాలయం వద్ద శుక్రవారం ఐసీడీఎస్ సీడీపీఓ ఎం.పూర్ణిమ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కిశోర వికాసం వేసవి శిబిరాలను ఆయన ప్రారంభించారు. కిశోర బాలికల సమస్యలు, పిల్లల సంరక్షణ, చిన్న పిల్లల అక్రమ రవాణా, పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల నిషేధ చట్టం, ఆత్మరక్షణ తదితర అంశాలను వివరించారు. నెల రోజుల పాటు జరిగే ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు మాట్లాడుతూ, మహిళలు, బాలికలు తమకు ఏ సమస్య వచ్చినా మీ నేస్తం 112, ఉమెన్ హెల్ప్‌లైన్ 181, చైల్డ్ లైన్ 1098కి ఫోన్ చేసి రక్షణ పొందాలని చెప్పారు. కిశోర బాలికల శిక్షణకు ఉద్దేశించిన ప్రత్యేక మెటీరియల్‌ను మహిళా పోలీసులకు అందించారు. జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, ఎంపీడీఓ చంద్రశేఖర్, డీసీపీఓ వెంకట్రావు, ఎస్సై రఘునాథరావు, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశా, కిశోర బాలికల సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంపు ప్రారంభం

తుని: ఐసీడీఎస్ తుని ప్రాజెక్టు పరిధిలో ఏర్పాటు చేసిన కిశోర్ వికాసం సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వెంకట్రావు కోరారు. శుక్రవారం స్థానిక బ్యాంకుకాలనీలోని ఐసీడీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపును ఆయన ప్రారంభించారు. పట్టణంతో పాటు, తొండంగి, కోటనందూరు, తుని మండలాలకు చెందిన అంగన్‌వాడీ కేంద్రాలను గ్రూపులుగా ఏర్పాటు చేసి, 11 నుంచి 18 ఏళ్ల బాలికలను కమిటీలు గుర్తించాలన్నారు. జూన్ 10 వరకు ప్రత్యేక శిక్షణ, అవగాహన కల్పిస్తామని సీడీపీవో శ్రీలత, డాక్టర్ హరికృష్ణ, మెప్మా అధికారి శ్రీదేవి, ఏసీడీపీవో నిహారిక, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, కిశోర్ బాలికలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వికాసంతోనే భవిష్యత్తు

రౌతులపూడి: కిశోర వికాస కార్యక్రమంతో బాలికల రక్షణ, వారి అభివృద్ధి జరుగుతుందని ఐసీడీఎస్ మండల విస్తరణాధికారి జానకీలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ కార్యక్రమంపై 11 నుంచి 18 ఏళ్లలోపు బాలికలకు బాల్య వివాహ చట్టం, వారి హక్కులు, రక్షణ, పోక్సో చట్టం, వ్యక్తిగత ఆరోగ్యం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే సైబర్ మోసాలు, ఆన్‌లైన్ భద్రత తదితర వాటిని వివరించారు. బాలికలంతా శ్రద్ధ వహించి, వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. ఎంపీపీ జి.రాజ్యలక్ష్మి, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ పైల సాంబశివరావు, మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యభాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పించాలి

ఏలేశ్వరం: ప్రతిఒక్కరికీ బాల్య వివాహాల నిషేధంపై అవగాహన కల్పించాలని సీడీపీఓ టీడీఆర్ పద్మావతి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం కిశోర వికాసంపై వేసవి శిక్షణ శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. కిశోర బాలికలకు సంపూర్ణ ఆరోగ్యం, ఇతర అంశాలపై అవగాహన కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, ఎంపీడీఓ సూర్యనారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు

ప్రత్తిపాడు రూరల్: సమాజంలో బాల్య వివాహాలతో అనర్థాలు తప్పవని ఎంపీపీ గోర్ల కాంతి సుధాకర్ అన్నారు. ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు అధ్యక్షతన కిశోర వికాసంలో భాగంగా శిక్షణా తరగతులు నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి మాట్లాడుతూ, బాల్య వివాహాల నిర్మూలనకు కఠిన చట్టాలు ఉన్నాయన్నారు. అయినప్పటికీ బాల్య వివాహాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలు విద్యావంతులైతే వారి కుటుంబాలు అభివృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సభ్యుడు వెలుగుల నాని, ఏఎంసీ వైస్ చైర్మన్ సుంకర సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

శంఖవరం: బాల్య వివాహాలను అరికట్టాలని ఐసీడీఎస్ ప్రొటెక్షన్ ఆఫీసర్ విజయ అన్నారు. శంఖవరంలో అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన కిశోర్ వికాసం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల్లో వరకట్న మరణాలు, బాల్య వివాహాలు, గృహ హింస వంటివి జరగకుండా వారిలో చైతన్యం తేవాలన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

వనదుర్గకు ఘనంగా చండీ హోమం

అన్నవరం: రత్నగిరి వనదేవతగా పూజలందుకుంటున్న వనదుర్గ అమ్మవారికి శుక్రవారం ఘనంగా చండీ హోమం నిర్వహించారు. సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి, కొండదిగువన తొలి పావంచా వద్ద ఉన్న కనకదుర్గ అమ్మవారికి పండితులు కుంకుమ పూజలు నిర్వహించారు. ఉదయం చండీ హోమం అనంతరం హోమగుండంలో పూర్ణాహుతి నిర్వహించారు. అమ్మవార్లకు వేద పండితులు వేదాశీస్సులు, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి ప్రసాదాలు నివేదించారు. వేద పండితులు వేదుల సూర్యనారాయణ, సంతోష్ ఘనాపాఠీ, వనదుర్గ ఆలయ అర్చకులు కోట వంశీ, పరిచారకుడు వేణు, వ్రత పురోహితులు చెల్లపిళ్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు. హోమంలో 30 మంది భక్తులు పాల్గొన్నారు. సత్యదేవుని ప్రధానాలయంలో దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు ఇంద్రగంటి నర్సింహమూర్తి ఆధ్వర్యంలో, కనకదుర్గ అమ్మవారికి అర్చకుడు చిట్టెం హరగోపాల్ ఆధ్వర్యంలో కుంకుమ పూజలు నిర్వహించి, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు.



చండీ హోమం పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

తాగునీటి ఎద్దడిపై కార్యదర్శులు దృష్టి సారించాలి

రౌతులపూడి: వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో ఎక్కడా తాగునీటి ఎద్దడి లేకుండా దృష్టి సారించాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కె.శ్రీదేవి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శివరామకృష్ణయ్య ఆధ్వర్యంలో తాగునీటి సమస్యలపై కార్యదర్శులతో సమీక్షా కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుత వేసవిలో ప్రజలందరికీ అందుబాటులో ఉండి, మరమ్మతులకు గురైన జీఎల్ఆర్ మంచినీటి ట్యాంకులు, చేతిపంపులను వినియోగంలోకి తేవాలన్నారు. ఓవర్ హెడ్ ట్యాంకుల ద్వారా సరఫరా చేసే పైపులైన్ల లీకేజీలను గుర్తించి, వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన చోట్ల తాగునీటి బోర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా కార్యదర్శులంతా బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ గౌతమ్, డిప్యూటీ ఎంపీడీఓ శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి



కె.గోపాలపురంలో మే డే వేడుకల్లో పాల్గొన్న నాయకులు

గండేపల్లి: ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేయాలని ఏపీఆర్‌సీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. మండలంలోని కె.గోపాలపురంలో శుక్రవారం మే డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కె గోపాలపురం, మల్లిసాల గ్రామాల మధ్య సర్వే నంబర్ 353లోని 508 ఎకరాల ప్రభుత్వ పోరంబోకు భూమిని పేదలకు పంచాలన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి సతీష్, నాయకులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.